# విభావసి

**వి**భావసి శరీరం కృశించింది. అడుగు పడటం అసాధ్యంగా వుంది. చెట్టు నీడ విశ్రాంతి నిస్తున్నా, మనసులో ఏదో ఆవేదన విభావసిని కదిలించి వేస్తోంది.

తను మందారుడనే విద్యాధరుని కుమార్తె. ఈ పర్వత శిఖర ప్రాంతమంతా బాల్యం నుండి తను తిరుగాడినట్టిదే. ఎన్నిసార్లు ఈ ప్రాంతంలో స్నేహితులతో వచ్చి ఆటలాడుకోలేదూ, మరెన్నిసార్లు తన బంధువులంతా ఈ పర్వత శిఖరాలపై జూదమాడటానికి వచ్చినపుడు తనూ వారి వెంటరాలేదూ - మరి ఈ మనోరమతో పుష్పాపచయానికి వచ్చిన తనకెందుకీ ఘోర శాపం- విభావసి కన్నీళ్ళు ఎడతెగకుండా ప్రవహిస్తున్నాయి. విద్యాధర కన్యగా ఇంతకాలం తను గర్వించిన సౌందర్యమంతా క్షణాలలో నశించి పోతుంటే చూస్తూ ఊరుకోవలసిందేనా - విభావసి అటు ఇటు చూసింది. మృగాలు, పక్షులు స్వేచ్ఛగా సంచరిస్తున్న అరణ్య మధ్యం తను వున్న ప్రాంతం అని తెలియగానే భయం కలిగింది విభావసికి ఓక్షణం.

అయినా గంధర్వ రాజకుమార్తెతో తనకి స్నేహమెందుకు, స్నేహమే అయినా ఆమెను వృద్ధముని శపిస్తే తనెందుకు కల్పించుకోవాలి, తను స్నేహధర్మంతో కల్పించుకున్నా, ఆ వృద్ధుని తనెందుకు దూషించాలి, దూషించినా, పసితనమని శాంతంతో తనను క్షమించి వదిలేయక ముని తననెందుకు శపించాలి, శపించినా ఈ భయంకరమైన వ్యాధి రావాలనే ఎందుకు శపించాలి - అయ్యో విధినెదిరించలేరంటే ఇదే, ముమ్మాటికీ ఇదే!!- విభావసి శూన్యంలోకి చూస్తూ లేచి నడవాలనే ప్రయత్నం చేసింది.

చెట్లపైనున్న పక్షులు కిలకిలమన్నాయి. ఒక్కసారిగా విభావసి ముఖం వికసించింది. "నీకు మంచి రోజులు ముందున్నాయి" - అంటున్నాయి పక్షులు. విభావసి కళ్ళెత్తి చెట్టు వంక చూసింది, "నిజం, నీకు శుభం జరుగుతుంది" మళ్ళీ కిచకిచమన్నాయి పక్షులు.

పక్షుల భాష, మృగాల భాష చిన్న నాడే నేర్చిన విభావసి ఆపల్కులకు పరవశించిపోయింది.

తనకి మంచి రోజులు ముందున్నాయని చెప్తున్నాయి ఈ పక్షులు - ఏమో, జీవితంపై విరక్తి కలిగిన మనసుకి ఈ మాటలు పన్నీటి జల్లులైనాయి- విభావసి కళ్ళలో కొత్త కాంతి నిండింది. గబగబా నడుస్తుంటే జింకపిల్ల వెంటపడి వస్తోంది. నల్లని కళ్ళు తిప్పుతూ ఏదో చెప్తోంది. విభావసి ఆనందం పట్టరాకుండా అయింది. ముని శాపగ్రస్తురాలైన తనకు మంచి భవిష్యత్తుందని ఈ పక్షులు మృగాలు చెప్పడంతో బతుకుపై ఆశ చిగిరించినట్లే అయింది.

చల్లని గాలి శరీరానికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంటే విభావసి గబగబా అడుగులు వేస్తోంది. కానీ ఎక్కడికి? ఈ క్షయరోగంతో వున్న తను తన విద్యాధరుల మధ్య బతకగలదా - అంతలోనే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. క్షణంలో నిస్పృహ ఆవరించుకుంది. అక్కడే ఆ శిలావేదిక పై కూలబడిపోయింది విభావసి. లోకమంతా చీకటిమయంగా అనిపించి, దీర్ఘంగా నిట్టూర్చింది.

ఎక్కడో దూరంగా అడుగుల చప్పుడు, ఏవో మాటల సందడి - మనోరమ గొంతు - ఇది నిజమా, కలా అనుకుంటూ మోకాళ్ళపై ఆన్చిన తల ఎత్తింది విభావసి.

ఎదురుగా మనోరమ, స్వరోచి....తన కళ్ళను నమ్మలేకపోతోంది.... మనోరమ విభావసి దగ్గర నిల్చింది.

"నా భర్త స్వరోచి, తన వద్దనున్న ఆయుర్వే విద్యతో నీ క్షయరోగం పొగొడుతాడు" - చెవులను నమ్మలేకపోయింది విభావసి.

మనోరమ, స్నేహితురాలు విభావసిని గట్టిగా కౌగిలించుకొని "నేను స్నేహధర్మాన్ని విస్మరించే స్వార్థపరురాలను కాను" - మనోరమ విభావసి కళ్ళ నుండి చెక్కిళ్ళ పై జాలువారుతున్న కన్నీటిని తుడిచింది.

ఆనాడు పుష్పాపచాయానికై తను, కళావతి, విభావసి బయలుదేరి రావటం, ఆ పర్వతగుహ, గుహలో దూదిరాశిలా వున్న ఋషీశ్వరుడు, అతని ధ్యానం భంగం చేయటం, అతని నుంచి ఘోరమైన శాపాలు పొందటం, తను స్వరోచిని వివాహమాడటం, అన్నీ, ఒకటొకటిగా మనోరమ కళ్ళముందు కదలాడాయి.

ఆయుర్వేద విద్యతో విభావసి వ్యాధి కుదిరింది. తిరిగి ఎప్పటి అందం. ఉత్సాహం విభావసిలో వెల్లువలై పారాయి. కానీ ఆమె మనసులో ఒకటే చింత, తనకు ఇంత సహాయం చేసిన మహారాజుకి తనేమి అర్పించుకోగలదు! విభావసి భావతరంగాలలో పక్షుల కిలకిలారావాలు కదలాడాయి.

"నావద్ద గొప్ప విద్యలేవి లేవు. కానీ --- నాకు పక్షుల, మృగాల భాషలు తెలుసు- ఆవిద్య తమరికి సమర్పించుకొనే భాగ్యం నాకు కలిగించండి"- విభావసి స్వరోచికి సవినయంగా నమస్కరించింది. మనోరమ స్వరోచి వంక సార్థకంగా చూస్తూ, చిరునవ్వు నవ్వింది.

విభావసి నుంచి ఆ విద్యను గ్రహించటమేకాక, ఆమెను చేపట్టాడు స్వరోచి మహారాజు.

ఆనందబాష్పాలు ఒత్తుకుంటూ స్వరోచి వెంట నడిచింది విభావసి ఎంతో ఉత్సాహంగా.

- కావ్యతారలు - వనిత ఆగష్టు 1989